నకిలీ ఏజెంట్ల అరెస్టు, రిమాండ్

వినాయక్‌నగర్, మార్చి 4: విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసం చేసిన నకిలీ గల్ఫ్ ఏజెంట్లను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, కోర్టులో హాజరు పర్చారు. ఇందుకు సంబంధించిన వివరాలను సైబర్ క్రైమ్ పీఎస్ ఏసీపీ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పెద్దపల్లికి చెందిన అలకుంట సంపత్, జిగిత్యాలకు చెందిన దండుగుల చిరంజీవి, మిట్టపల్లి నర్సారెడ్డి కలిసి గల్ఫ్‌లో డాటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురు నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేశారు. వారిని థాయ్‌లాండ్, లావోస్ దేశాలకు పంపించారు. వారు లావోస్‌లో సైబర్ నేరాలు చేయాల్సి వచ్చింది. చివరకు భారతీయ రాయబార కార్యాలయం సహకారంతో ఇద్దరు బాధితులు ఇండియాకు తిరిగి వచ్చారు. తమను మోసం చేసిన వారిపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో నిందితులను మంగళవారం అరెస్టుచేసి, కోర్టులో హాజరు పర్చగా 14రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఏసీపీ తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు ముగ్గురిని సెంట్రల్ జైలుకు పంపించినట్లు పేర్కొన్నారు.

గోడౌన్ పరిశీలన

కంఠేశ్వర్, మార్చి 4: జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు.. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్ తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపర్చిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ కొనసాగిన మరమ్మతు పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నాణ్యతతో పనులు జరిగేలా పర్యవేక్షణ చేయాలని పంచాయతీరాజ్ ఈఈ శంకర్‌ను ఆదేశించారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన కలెక్టర్ అవి నిరంతరం పని చేసేలా చూడాలన్నారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్, సిబ్బంది సాత్విక్, విజేందర్, అగ్నిమాపక శాఖాధికారి నర్సింగ్ తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

కంఠేశ్వర్, మార్చి 4: జిల్లాలోని భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆల్ ఇండియా కో-ఆర్డినేషన్ కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో 18 సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌కు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు ఎం.మోహన్, నర్సింగ్‌రావు, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శివకుమార్ మాట్లాడారు. భవన నిర్మాణ రంగ కార్మికులకు భద్రత, చట్టబద్ధ హక్కులు అమలు చేయడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయన్నారు. పని స్థలాల్లో ప్రమాదాలు జరిగి దివ్యాంగులుగా మారడం, పలువురు మృతి చెందుతున్నా బాధిత కుటుంబాలకు ఎలాంటి సదుపాయాలు కల్పించడం లేదన్నారు. సంక్షేమ బోర్డును ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పాలనే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి 55 ఏండ్లు నిండిన వారికి రూ.పదివేల పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించని ఎడలా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్న, ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక నాయకులు ఎల్లప్ప, మల్లేశ్, శ్రీనివాస్, అశోక రమేశ్, ప్లంబర్ వర్కర్స్ నాయకులు రాజు, విజయ్, సురేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో బిగాల పూజలు

పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, నాయకులు

సుభాష్‌నగర్/ ఖలీల్‌వాడి, మార్చి 4: ఆలయాలు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిబింబాలని, రేణుకాఎల్లమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ షిర్డీసాయినగర్‌లో రేణుక ఎల్లమ్మ దేవాలయంలో మంగళవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నగర మాజీ మేయర్ నీతూ కిరణ్ శేఖర్ దంపతులు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ క్యాలెండర్ల ఆవిష్కరణ

గోపూర్‌లో క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చందూర్/ పొతంగల్, మార్చి 4: మోస్రా మండలంలోని గోపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్‌ను ఆ పార్టీ నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. పలువురు నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కత్తి శంకర్, నాయకులు శేఖర్ గౌడ్, వెంకట్ రెడ్డి, చరణ్ రెడ్డి, బగ్బుల్ ఖాన్, దొడ్ల సతీశ్, సుధాకర్ చారి, భీమయ్య, ప్రకాశ్, కిరణ్ రెడ్డి, వై. గంగారాం, సంఘ సాయిలు, శ్రీనివాస్ రెడ్డి, చిన్న అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. పొతంగల్ మండలంలోని జల్లాపల్లి అబాదీలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి సూదం నవీన్ ఆధ్వర్యంలో క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆరీఫ్, ఏజాక్, సాయిలు, సురేశ్, ఇబ్రహీం, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

డిచ్‌పల్లి, మార్చి 4: మండలంలోని రాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో 1999-2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయులు జన్ను అనిత, సీమా పాల్గొని తమ జ్ఞాపకాలను విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, గంగాధర్, సుమన్, సురేశ్, రాజేశ్వర్, సువర్ణ, సుమలత, హసీనా, సుజాత, హన్మాండ్లు, భాస్కర్, రవి, సుధాకర్, సాయిలు, గంగాదాస్, మురళి పాల్గొన్నారు.

చెత్తను తొలగించారు

కంఠేశ్వర్, మార్చి 4: బ్యాంకు కాలనీలో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నది. స్పందించిన మున్సిపల్ అధికారులు చెత్త సేకరించే ట్రాక్టర్‌ను పంపించి శుభ్రం చేయించారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

డిచ్‌పల్లి, మార్చి 4: తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ లైఫ్‌సైన్సెస్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్, బీబీఏ, బీసీఏ) ఒకటి, మూడు, ఐదో సెమిస్టర్ ఫలితాలను వైస్ చాన్స్‌లర్ టి. యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.యాదగిరి, కంట్రోలర్ ఆచార్య సంపత్‌కుమార్ మంగళవారం విడుదల చేశారు. మొత్తం 19,574 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 6,436 మంది, 32.86 శాతం ఉత్తీర్ణత సాధించారు. కార్యక్రమంలో అడిషనల్ కంట్రోలర్స్ డాక్టర్ నందిని, డాక్టర్ శాంతాబాయి, డాక్టర్ సంపత్ పాల్గొన్నారు. పూర్తి వివరాలు తెలంగాణ వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు కంట్రోలర్ తెలిపారు.

భూమాగౌడ్‌కు నివాళి

ఖలీల్‌వాడి/ కోటగిరి, మార్చి 4: బొజ్జా భూమాగౌడ్ వర్ధంతి సభను సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భూమాగౌడ్ గీత కార్మికుల సమస్యలపై పోరాటం చేశారని గుర్తుచేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూమయ్య, నాయకులు రాజేశ్వర్, వెంకటేశం గుప్తా, రాధాకుమార్, భానుచందర్ పాల్గొన్నారు. కోటగిరిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, మండల కార్యదర్శి విఠల్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సభలో మండల నాయకులు నల్ల గంగాధర్, వీరేశం, శంకర్, భీమయ్య, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఓబన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

ఖలీల్‌వాడి, మార్చి 4: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న విగ్రహ ఏర్పాటు కోసం వడ్డెర లేబర్ కాంట్రాక్ట్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నాగారంలో భూమిపూజ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఆలకుంట సాయిబాబా, అధ్యక్షుడు మక్కల గోపాల్, ఉపాధ్యక్షుడు శివాజీ, కోశాధికారి శ్రీను, సంయుక్త కార్యదర్శి సాయి కుమార్, డైరెక్టర్లు మహేశ్, వెంకటేశ్, రాజ్‌కుమార్, యాదగిరి, ప్రసాద్. చంద్రబాయి, రాములు, రాజు, హన్మంతు, వెంకటి, ఉపేంద్ర, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలతో సమాజంలో విప్లవాత్మక మార్పులు

డిచ్‌పల్లి, మార్చి 4: తెలంగాణ యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో పరిశోధన పత్రాల తయారీ అనే అంశంపై విభాగాధిపతి, సెమినార్ కన్వీనర్ ఆచార్య సీహెచ్ ఆంజనేయులు అధ్యక్షతన మంగళవారం ఒక రోజు సెమినార్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ఆచార్య టి.యాదగిరిరావు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాల్లో క్షేత్రస్థాయి పరిశోధనలే సమాజంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకవస్తాయన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం. యాదగిరి మాట్లాడుతూ.. నూతన పరిశోధనలతో రోజురోజుకూ పెరిగే సవాళ్లను అధిగమించాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల మాట్లాడుతూ.. చాట్ జీపీటీ, గూగుల్, డీప్ సీక్ లాంటివి మానవ పరిశోధనలకు సరి కావన్నారు. కన్వీనర్లు ఆచార్య కైసర్ మహ్మద్, ఆచార్య అపర్ణ, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ వాణి, డాక్టర్ కిరణ్ రాథోడ్‌తోపాటు వివిధ కళాశాలల మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొని ఉత్తమ పరిశోధన పత్రాల తయారీపై అవగాహన పొందారు.

రుద్రూర్ టీజీబీ వార్షికోత్సవం

రుద్రూర్, మార్చి 4: రుద్రూర్‌లోకి తెలంగాణ గ్రామీణ బ్యాంకు పదో వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఇప్పటివరకు బ్యాంకులో 8వేల మంది ఖాతదారు లు ఉన్నారని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎం నవీన్‌కుమార్, ఎస్ఎంవోలు అజయ్, అనిల్, రుద్రూర్, బోధన్ బ్రాంచ్ మేనేజర్లు సంపత్‌కుమార్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయాన్ని వీడాలి

జక్రాన్‌పల్లి, మార్చి 4: విద్యార్థులు భయాన్ని వీడి పరీక్షలకు సిద్ధం కావాలని డీఈవో అశోక్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన విజయ స్ఫూర్తి కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎలాంటి భయం లేకుండా ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. మోటివేటర్ మహేశ్, హెచ్ఎం లింగన్న, ఎంఈవో ఎం.శ్రీనివాస్, పడకల్ కాంప్లెక్స్ హెచ్ఎం సురేందర్‌రెడ్డి, కాసర్ల నరేశ్, రాజు, నారాయణ, అరవింద్, గోపాలకృష్ణ, ముద్దు కృష్ణ, స్రవంతి, రవీందర్, హెచ్ఎంలు, 480మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల కోసమే లోక్ అదాలత్

వినాయక్‌నగర్, మార్చి 4: ప్రజల కోసమే జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ నాల్గో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ (జూనియర్ సివిల్ జడ్జి) వడ్డి హరికుమార్ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని కోర్టు హాల్‌లో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ భూసారపు రాజేశ్‌గౌడ్, పోలీసు, ఎక్సైజ్ సిబ్బందితో లోక్ అదాలత్‌పై మంగళవారం సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈనెల 8వ తేదీన నిర్వహించే లోక్ అదాలత్ విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఐదో టౌన్, మాక్లూర్, ఎక్సైజ్ ఎస్సైలు గంగాధర్, రాజశేఖర్, మల్లేశ్, కోర్టు కానిస్టేబుళ్లుఎంఏ లతీఫ్, విషాన్ గౌడ్, బాలకృష్ణ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లైన్‌మెన్ దినోత్సవం

వర్ని సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్‌కు సన్మానం

కంఠేశ్వర్/ రుద్రూర్, మార్చి 4: లైన్‌మెన్ దివస్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పవర్ హౌస్ మీటింగ్ హాల్‌లో మంగళవారం రూరల్ సబ్‌డివిజన్ ఆధ్వర్యంలో ఆర్టిజన్, అన్‌మ్యాన్, జేఎల్ఎం, ఎల్ఎం, ఎల్ఐ, ఎస్ఎల్ఐలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈ ఆపరేషన్ డిచ్‌పల్లి జాడేఉత్తమ్, ఏడీఈ ఆపరేషన్స్ రూరల్ నిజామాబాద్ రాజేశ్‌కుమార్ హాజరై మాట్లాడారు. సంస్థలో క్షేత్రస్థాయిలో పనిచేసే యుద్ధవీరులకు ప్రతిఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. వర్ని మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో ఏఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం వర్ని సెక్షన్, జలాల్‌పూర్ విద్యుత్ ఉపకేంద్రంలో ఆర్టిజన్లు, జేఎల్ఎం, ఎల్ఐ, ఎస్ఎల్ఐని సన్మానించారు. కార్యక్రమంలో బోధన్ డీఈ (ఆపరేషన్స్) ఎండీ ముక్తార్, ఏడీఈ(ఆపరేషన్స్) కె.నగేశ్ కుమార్, ఏడీఈ (కన్‌స్ట్రక్షన్) తోట రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కత్తిపోట్ల కలకలం

వినాయక్‌నగర్, మార్చి 4: కత్తితో కడుపులో పొడిచిన ఘటన మంగళవారం మధ్యాహ్నం నగరంలోని గాజులపేట్‌లో చోటు చేసుకున్నది. రెండో టౌన్ ఎస్సై యాసిర్ అరాఫత్ తెలిపిన మేరకు.. గాజులపేట్‌లోని నాయీ బ్రాహ్మణ కులస్తులు తమ సంఘంలో సమావేశం నిర్వహించుకున్నారు. సమావేశం అనంతరం మహేశ్ తన బంధువు సంతోష్‌కు నీ కొడుకులు 'తొందురోలు ఉన్నారురా' అని హేళన చేస్తూ మాట్లాడాడు. దీంతో ఆగ్రహించిన సంతోష్ ఇంట్లోకి వెళ్లి కూరగాయలు కోసే కత్తి తీసుకువచ్చి మహేశ్ కడుపులో పొడిచాడు. దీంతో తీవ్ర రక్తస్రావమైన బాధితుడిని స్థానికులు చికిత్స కోసం దవాఖానకు తరలిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంతోష్‌పై కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోటగిరి ఉన్నత పాఠశాలలో 'స్కూల్ డే'

కోటగిరి, మార్చి 4: కోటగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ డే నిర్వహించారు. విద్యార్థులు నృత్యం చేయడంతోపాటు ఆటపాటలతో అలరించారు. పదో తరగతి విద్యార్థులకు ఘరంగా వీడ్కోలు పలికారు. హైస్కూల్ హెడ్‌మాస్టర్ శ్రీనివాసరావు, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బర్ల సాయిలు, ప్రధాన కార్యదర్శి ఉదయ్‌చంద్ర, పార్వతీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకు సాగాలి

రుద్రూర్, మార్చి 4: వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సమన్వయంతో ముందుకు సాగాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పోలాస ఇన్‌చార్జి వ్యవసాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ శ్రీలత అన్నారు. రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన శాస్త్రీయ సలహా మండలి సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. రానున్న వానకాలం, యాసంగిలో చేపట్టనున్న పరిశోధన అంశాలపై పలు సూచనలు చేశారు. రుద్రూర్ విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ అంజయ్య మాట్లాడుతూ.. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో ముందుకు సాగుతాయని అన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ శివకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాస్, పశుసంవర్ధక డైరెక్టర్ జగన్నాథచారి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, శాస్త్రీయ సలహామండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఈ నెలాఖరు లోగా పనులు పూర్తి చేయాలి

భీమ్‌గల్, మార్చి 4: పట్టణంలో నూతన గ్రంథాలయ నిర్మాణ పనులు ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం ఆయన రూ.28 లక్షలతో చేపట్టిన గ్రంథాలయ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అధికారులను పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

చోరీకి గురైన బైక్ లభ్యం

నవీపేట, మార్చి 4: మండల కేంద్రంలో వారం రోజుల క్రితం చోరీకి గురైన బైక్ మంగళవారం లభ్యమైనట్లు ఎస్సై వినయ్ తెలిపారు. గతనెల 25వ తేదీ రాత్రి సరస్వతినగర్‌లో నివాసముంటున్న ఓ దినపత్రిక విలేకరి నర్సింహస్వామి(బాబు)కు చెందిన బైక్‌ను దొంగలు చోరీ చేసిన విషయం తెలిసిందే. చోరీకి గురైన బైక్‌ను దుండగులు ధ్వంసం చేసి లింగం గుట్ట పాలిటెక్నిక్ కళాశాల వద్ద వదిలి పెట్టి పారి పోయినట్లు ఎస్సై పేర్కొన్నారు. బైక్‌ను స్వాధీనం చేసుకొని దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

Summons Through publication
IN THE COURT OF HON'BLE SENIOR CIVIL JUDGE AT HUZURABAD
O.S.NO 8 OF 2023
Between:
Vemula Sambaiah ...Plaintiff
AND
Busa Bhagyalaxmi and others ...Defendants
To
D4: Thirunagiri Uma Devi, W/o Satyanarayana Reddy, Age: 62 yrs, R/o. H.No. 10-14-1836, Seetharam Nagar Colony, Main Road, Nizamabad Proper and District Pin-503001, Cell No: 90146 40036.
Whereas the above named Plaintiff filed the above suit against you for DECLARATION AND PERMANENT INJUNCTION against you and others.
Therefore, you are hereby warned to appear in this Court in person or by a pleader duly instructed on 26-03-2025 at 10:30 am to show cause against the suit, failing which in the said suit will be heard and determined in your absence.
// BY ORDER OF THE COURT //
Sd/- Goskula Srinivas, Advocate
Huzurabad. Cell: 94403 50466.

పాలిటెక్నిక్ కళాశాలలో టెక్నికల్ ఫెస్టివల్

విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

మాక్లూర్(నందిపేట్),మార్చి4: నందిపేట్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా స్థాయి సృజన టెక్నికల్ ఫెస్టివల్‌ను మంగళవారం నిర్వహించారు. మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా విద్యార్థులు ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. నందిపేట్, కోటగిరి, నిజామాబాద్, నవీపేట్ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించి వాటి విశిష్టతను వివరించారు. నందిపేట్ ఫుడ్‌పార్క్ పరిశ్రమ మేనేజర్ ఎం.సతీశ్‌కుమార్ న్యాయనిర్ణేతగా వ్యవహరించి రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాజెక్టులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజ్‌కుమార్, విభాగాల అధిపతులు కిశోర్, లావణ్య, లక్ష్మణ్ శాస్త్రి, పరిపాలన అధికారి తులసిరామ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి

- సీఎంకు పోస్టుకార్డులు పంపిన విద్యార్థులు

పోస్టుకార్డులను చూపుతున్న విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్, మార్చి4: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కనీసం 20శాతం నిధులు కేటాయించాలని, మూడేండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు పంపారు. అనంతరం పట్టణంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు ప్రిన్స్ విలేకరులతో మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ పూర్తయినా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు హుస్సేన్, రాహుల్, కల్యాణ్, సాయి, పవన్, అక్షయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

మోర్తాడ్/భీమ్‌గల్/వేల్పూర్/ఆర్మూర్‌టౌన్, మార్చి4: కమ్మర్‌పల్లి శివారులో ఉన్న గాంధీనగర్‌లో ప్రభుత్వ పాఠశాలను ఎంపీడీవో రాజశ్రీనివాస్ మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాల రిజిష్టర్లను, విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించారు. విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.భీమ్‌గల్ మండలంలోని బడాభీమ్‌గల్, పెద్దకాడి తండా, సికింద్రాపూర్ గ్రామాల్లో ఎంపీడీవో సంతోష్ కుమార్ పర్యటించారు. బడాభీమ్‌గల్‌లో గ్రామ పంచాయతీ రికార్డులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం పెద్దమ్మకాడి తండా, సికింద్రాపూర్‌లో నర్సరీలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీవో వెంట ఏపీవో నర్సయ్య, సిబ్బంది ఉన్నారు. వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌ను ఎంపీడీవో బాలకిషన్ తనిఖీ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని జిరాయత్ నగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మున్సిపల్ కమిషనర్ రాజు తనిఖీ చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

మాక్లూర్, మార్చి 4: ధర్మోరాకు చెందిన గందం గంగాధర్(46) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మాక్లూర్ మండలం ధర్మోరా గ్రామానికి చెందిన గంగాధర్ రెండేండ్ల క్రితం బతుకు దెరువు కోసం గల్ఫ్ వెళ్లి నెల రోజుల క్రితం తిరిగి వచ్చాడు. చేసిన అప్పులు తీర్చలేక, ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో మంగళవారం నందిపేట్ మండలం ఐలాపూర్ శివారులోని పెద్ద కుంట చెరువు వద్ద వేప చెట్టుకు ఉరేకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య గందం సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రేపటి నుంచి పోచారం రైల్వే క్రాసింగ్ మూసివేత

పోచారం రైల్వే క్రాసింగ్ ఇదే

బోధన్, మార్చి 12: బోధన్ - నిజామాబాద్ రైల్వే మార్గంలో ఎడపల్లి మండలం పోచారం వద్ద ఉన్న రైల్వే క్రాసింగ్‌ను ఈనెల 6 నుంచి మూసివేయనున్నారు. ఇందుకు సంబంధించిన నోటీస్‌ను ఎడపల్లి పోలీస్ స్టేషన్‌లో రైల్వేశాఖ అందించింది. ఈ రైల్వే క్రాసింగ్ వద్ద బోధన్ - నిజామాబాద్ ప్రధాన రహదారి నుంచి పోచారం గ్రామానికి వెళ్లేందుకు అండర్ పాస్‌ను నిర్మించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఈ పనులు పూర్తయ్యేవరకు పోచారం గ్రామస్తులు దూపల్లి గేట్ ద్వారా రాకపోకలు సాగించాలని వారు సూచించారు. ఎన్ని నెలల పాటు కొనసాగుతాయన్న విషయమై స్పష్టత లేదు.

దవాఖాన తనిఖీ

ఆర్మూర్‌టౌన్, మార్చి4: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఐవో అశోక్ మంగళవారం తనిఖీ చేశారు. ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్, మెడికల్ ఆఫీసర్ మైత్రి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, KUNDEN RAJU (Old Surname /name) R/o. H.No. 5-15, Sirnapally, Indalwai, Dist. Nizamabad, Telangana Have changed My Surname As KUNDENA RAJU S/o. KUNDENA BHUMALINGAM (New name)
NTZ-338483

PASSPORT LOST

★I, PUPPALA SHASHIKANTH S/o. PUPPALA KISHAN, R/